("జ్యోతి" మాసపత్రిక-దీపావళి 1980)

దయచెయ్యండి

తలుపు తెరిచింది పార్వతి.

ఎదురుగా ఎవరూ లేరు.

క్షణంసేపు "మనింటికి కాదేమోలే" అనుకుంది. అందుకు ఆధారంగా అంతకుముందు తలుపు తీయడానికి చేసిన ఆలస్యంలో ఆలోచన నిలిచింది. కాలింగ్ బెల్ పెట్టించి నాలుగేళ్ళు దాటింది. ఇన్నాళ్ళు ఈ యింటితో ఇంట్లో వాళ్ళతో పరిచయం పనీ వున్నవాళ్ళందరికీ తెలిసిన ఈ కాలింగ్‌బెల్, ఇప్పుడొచ్చిన ఆగంతకుడికి తెలీకపోయిందా? ఈతలుపు చప్పుడు మనింటిదే అయినా ఈ మనిషి మనింటికోసం రాలేదేమో....

కొద్దిగా తెరిచిన తలుపులోంచి తల యివతల పెట్టి వరండాలోకి దృష్టి సారించింది పార్వతి. వరండాకి అవతలి చివర్ని ఓ మనిషి నుంచుని వున్నాడు. మసకచీకట్లో కూడా మొగాడి రూపు తెలుస్తోంది. గుండు చేయించుకొని వున్నాడు.

లైటు వేసింది పార్వతి. అది వెలగలేదు. అప్పుడు గుర్తొచ్చినట్టయింది. వొచ్చిన మనిషి కాలింగ్ బెల్ మీట నొక్కక తలుపు చప్పుడు చెయ్యడమెందుకో. దాదాపు అరగంట అయింది. విద్యుత్ సరఫరా ఆగిపోయి.

"ఎవరూ?" అని కొంచెంగా కలిగిన భయాన్ని సందేహంగా మారుస్తూ దీర్ఘంతీసి అడిగింది పార్వతి.

అప్పటికి సుందర్రావు వరండాకున్న సన్నటి పొట్టికర్ర జాలరిమీద ఒక కాలువేసి, సిగరెట్టు వెలిగించుకుంటున్నాడు. అంతే! పార్వతి నిలువునా రక్తపు పోటు వచ్చినట్టు అల్లాడిపోయింది.

"పిల్లలెవరూ లేరా?" అని యిటుతిరిగాడు సుందర్రావు.

ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు పార్వతి. ఆమెకి ఒక్క ఉదుటున దుఃఖం ముంచుకొచ్చేసింది. కాని, దుఃఖాన్ని మింగేసి వెంటనే దాని నివారణకి ఏదో చేసెయ్యడం ఆమెకి ఎన్నాళ్ళనించో అలవాటైపోయింది. వెంటనే మాట్లాడకుండా లోపలికి వెళ్ళి, ఈ మధ్యనే తనకి అలవాటవుతున్న పడకకుర్చీ తీసు

కొచ్చి అంతవరకూ మూసివున్న రెండో తలుపు తెరిచి, పూర్తిగా తెరిచున్న ద్వారంలోంచి కుర్చీ బైటికితెచ్చి వరండాలో వేసింది.

ఆ నాలుగడుగులూ నెమ్మదిగావేసి, కుర్చీ దాకావచ్చి. "అంతా బాగున్నారా?" అంటూ కూర్చుని "నువుకూడా కూర్చో" అన్నాడు సుందర్రావు.

పార్వతి ఇటువేపు వచ్చి. కర్రజాలరికి ఆనుకొని నిలబడింది. "ఎప్పుడు, రావడం?" అంది.

కాలుస్తున్న సిగరెట్టులోంచి మరోమాటు పొగపీల్చి "నేనీ వూరొచ్చి నాలుగురోజులైంది......—" అన్నాడు సుందర్రావు. పార్వతి మరేమీ అడగలేదు. "నిన్న చూశాను నిన్ను! గ్రంధాలయం భవనంలో స్వామి దరహాసానంద గారి ఉపన్యాసం వినడానికొచ్చేవు కదా. అక్కడ నన్నుచూసేవు! గుర్తుపట్టేవనే అనుకున్నాను. కాని గుర్తు పట్టలేదని ఇప్పుడే తెలిసింది........"

"ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోలేదు. కాని,ఆయన మళ్ళీ ఈ యింటికి వస్తారని అనుకోడం మెదడులో ఏ ఒక్క గ్రంధికీ యిష్టంలేదు. అంచేత ఎవరిలోనూ కూడా ఆయన్ని చూడ్డంలేదు నేను—" అనుకుంది పార్వతి.

"అబ్బాయీ కోడలూ కులాసా?"

"ఆ!"

"ఎక్కడికి వెళ్ళేరు?"

"సినిమాకి"

"పాప దగ్గర్నుంచి వుత్తరాలొస్తున్నాయా?"

"ఆ!"

"మనవలూ మనవరాళ్ళూ—?"

"ఇంకా లేరు........"

"నువ్వు కూర్చున్నావుకాదు!"

—"నన్ను మీరెప్పుడైనా కూర్చోనిచ్చారా?" అనుకుంది పార్వతి.

........కూర్చోనిచ్చేరు ....పెళ్ళిలోనూ, పెళ్ళయిన ఆ కొత్తలోనూ, ఏడాది కాపరం పూర్తవకముందే కొడుకూ.మూడోఏడాది వెళ్ళకముందే కూతురూ పుట్టేరు. మరో ఏడాది గడిచేసరికి ఆయన వెళ్ళిపోయారు, ట్రాన్స్‌ఫర్ మీద. అంతే? అవాల్టినుంచి ఇవాల్టిదాకా నేను కూర్చోలేదు. నడుస్తూనే వున్నాను. తరిమి తరిమి కొడుతున్న జీవితానికి భయపడి పరుగులు పెడుతూనే వున్నాను.

కూర్చుని తినడానికి యోగ్యతలేదు. కూర్చొ పడిపోకుండా, చతికిల్లా పడి పోకుండా నిలబడే వున్నాను. మీ ధర్మమా అని ఆ ఇద్దరు బిడ్డల్నీ ప్రసాదించేరు. లేకపోతే కూర్చునే ఉందునో కూడుకుపోయే ఉందునో?

ఆ నిశ్శబ్దం సాయంతో సిగరెట్టుని పూర్తిగా కాల్చేసి, అప్యాయమైన ఆఖరి దమ్ము పీల్చేసి, దూరంగా పారేశాడు సుందర్రావు. కుర్చీలో వెనక్కి వాలి, కాళ్ళు రెండూ కుర్చీ కుడికాలిమీద పెట్టుకుని మళ్ళీ ఏదో మాట్లాడతా నన్నట్టు గొంతు సవరించుకున్నాడు.

పార్వతికి హటాత్తుగా పొయ్యిమీది పాలూ, వంటింట్లో ఇందాకటికే అయి పోతానూ ఆరిపోతానూ అంటూ బెదిరించిన కొవ్వొత్తీ జ్ఞాపకం వచ్చాయి. వెంటనే లోపలికి వెళ్ళింది.

సుందర్రావుకి నిన్న స్వామి దరహాసానంద చెప్పిన మాటలు గుర్తు కొచ్చాయి. "శిష్యా! ఈ నగరంలో నువ్వు పుట్టి, పెరిగి వివాహితుడవై. ఉద్యో గస్తుడవై, ఇల్లుకట్టి బిడ్డల్ని కన్నానని చెప్పావు. బహుశా ఇందాక సభలో మొదటి వరసలో చివర్న కూర్చున్న భద్రి నీ పూర్వాశ్రమపు ఇల్లాలై ఉంటుంది. నాకు నువ్వు పరిచయమై, శుశ్రూషలో ఉండిన ఈ నాలుగేళ్ళ కాలంలో నువ్వు ఏ స్త్రీని అలాంటి ఆచంచలమైన విలక్షణమైన సామీప్యం కళ్ళ లోకి తెచ్చుకుని చూడడం నేను చూడలేదు. వెళ్ళిపో. సంకోచించకు. నీకు తగి నది గృహస్థాశ్రమమే. బాధ్యతలకి భయపడో, సంసారపు నలసారానికి విసుగు చెందో నువ్వు సన్యాసం అనుకుని వానప్రస్థం స్వీకరించావు. ఇంకా నీ పూర్వాశ్రమపు కుటుంబానికి నువ్వు చెయ్యగలిగింది ఏదో ఉంటుంది. వెళ్ళి అది నెరవేర్చుకో. అదే నీకు పరమావధి. సెలవు!"

స్వామికి తను పూర్తిగా అర్ధం కాలేదు. చెప్పిన సూత్రం చప్పున తెలుసు కోగలడని తెలుసుకున్నారే తప్ప. తన బహుగుణ గ్రహణ పారీణత వారికి గ్రాహ్యం కాలేదు.

ఆ చురుకుతనం తాను పుట్టిన నేలలోదేమో. ఇరవై ఎనిమిదో యేట అంత పెద్ద కంపెనీకి అంత ముఖ్యమైన అధికారి కాగలిగాడు తను. తను వేసిన ఎరలను మింగి, ఎంతోమంది ప్రభుత్వాధికారులు, ఇతర వ్యాపార సంస్థల యజమానులు తన గాలాలకు చిక్కుకుని, తను పని చేసిన కంపెనీకి బాగా మేలు చేసేరు, చాలా కాలంపాటు.

హైదరాబాదులో తను ఒక్కడూ వుంటూ కంపెనీకి బిజినెస్ సంపాదించ డానికి చేసిన ఖర్చుకి, ముందే తీసుకున్న మొత్తానికి వివరణగా పంపిన ఒక బిల్లు మీద ఇక్కడి అకౌంట్స్ మేనేజర్ పెట్టిన అభ్యంతరాలు అతి సమంజస మైనవి. అయితే కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు ఆ బిల్లును పూర్తిగా ఆమోదిస్తూ అన్నమాటలు; "మర్రిచెట్టున వ్రేలాడే గబ్బిలం మర్రికాయలు తింటే అది తప్పు కాకూడదు. ఎంచేతంటే దానికి మామిడికాయలు దొరకవు కనక. అంచేత, ఏ ఎరలు ఉపయోగించి సుందర్రావు ఇతరుల్ని వశం చేసుకుంటున్నాడో ఆ ఎరలకి సుందర్రావే ఎర ఐపోతే, ఆ వ్యసనాలు అతన్నే మింగేస్తె మనం కంపెనీ బాగుపడిందా లేదా అన్నదే చూసుకోవాలిగాని. మిగతా వేవీ పట్టించుకో కూడదు!

ఆ రోజులు ఎంత వర్ణ పూర్ణాలు! ఆ రంగుల కలలన్నీ ఓ విధంగా అబద్ధాలే. కాని అవి నిజంగా జరిగాయి! తను కబురు చేస్తె ఇతరుల ఆనందం కోసమా తన సౌఖ్యంకోసమా అని అడక్కుండా వొచ్చి పాత్రధారణ చేసిన సుందరీమణుల్లో ఇద్దరు ముగ్గురు, కావ్యాల్లోనూ పురాణాల్లోనూ కూడా చెప్ప లేనంత అందం వుండిన బంగారు శలాకలు కాదూ?....వాళ్ళ శీల ప్రవర్తనల నైజం తెలిసీకూడా తనకి వాళ్ళలో ఏ ఒక్కరితోనైనా సహజీవనం ఏర్పడితే బాగుండునని ఎన్నిసార్లు అనిపించలేదు!.........తన జీవితంలో ఆ భాగం. పాద రసం లాంటిదీ, ఏకచక్ర రథం లాంటిదీ అయిన తన చురుకు తనం, స్వామి పూర్తిగా ఊహించగలరా?

పార్వతి అలికిడైతే అటు చూశాడు సుందర్రావు ఒక చిన్న స్టూల్ తెచ్చి అతనికి ఎడంవేపున పెట్టింది. మళ్ళాలోపలికెళ్ళి ఒకచేత్తో గ్లాసూ, మరొక లాంతరుతెచ్చింది. గ్లాసు స్టూలుమీద వుంచి, లాంతరును ద్వారం పక్కన మేకుకి తగిలించింది; "పుచ్చుకోండి" అన్నది.

"ఏమిటది?"

"పాలు?"

సుందర్రావు నవ్వాడు. "పాలు పుచ్చుకోడానికి దీపం వుండాలా?"

"మేమింకా సన్యాసులం కాలేదుకదా. మాకు చేతికీ నోటికీ మధ్య చీకటి వుంటుంది"

"కాళ్ళూ చేతులూ కడుక్కోవాలి-" అన్నాడు సుందర్రావు, ఇబ్బందిగా.

సిగరెట్టు తాగొచ్చు. కాని కాళ్ళూ చేతులూ కడుక్కోకుండా పాలగ్లాసు ముట్టరు!....ఏదో ఒక అబద్ధపు నీతి!....అనుకుంటూ లోపలికెళ్ళింది పార్వతి.

........ఐదేళ్ళనాడు హైదరాబాదులో–అప్పుడూ యిలాగే.

తననీ పిల్లల్నీ తమపాటికి వదిలేసి వెళ్ళిపోయి, పదేళ్ళకి ఆ కన బడ్డం....ఆ పదేళ్ళు ఎంత కష్టంగా గడిచాయి!

తాగుతున్నారు, తిరుగుతున్నారు–అని తెలిసిననాడే తను అడిగింది–అదేం ఖర్మమో, ఏ అడదానికైనా. తన మొగుడు యిలాగా అని ఊరూ వాడా తెలిసేక అందరికంటె ఆఖర్ని తెలుస్తుంది కాబోలు....అంతే–ఆ మర్నాడే, హైదరా బాదులో కొత్తగా ఆఫీసు పెట్టాలి, ఇవాళే ప్రయాణం అన్నారు. ఆ ప్రయాణమే ప్రయాణం. అటు వెళ్ళిన మనిషి మరి ఇటు రాలేదు. ఉత్తరాలకి సమాధానం లేదు. రమ్మని టెలిగ్రాములిస్తే ఫికర్ లేదు. నేనే వస్తున్నానని రాస్తే టెలి గ్రాములిస్తే, సరిగ్గా అదే రోజున క్యాంపు, నెల్లాళ్ళవరకు రారని ఎవర్తో చెప్పడం.

కొన్నాళ్ళు నెలనెలా ఇంత అని డబ్బు పంపించేరు. ఇంక ఆర్నెల్లే ఇలా పంపుతాను సుమా అని సూచించేరు వోసారి. ఆ ఆరునెలల్లో చేసిన ఉద్యోగ ప్రయత్నాలే ఈ జీవితానికి రూపాన్నిచ్చేయి. ఆ మౌనం అలా పదేళ్ళు!.... పిల్లాడు గ్రాడ్యుయేట్ అయ్యాడు. ఉద్యోగం సంపాదించుకున్నాడు. పిల్ల ఎదిగింది, పెళ్ళి అయింది, హైదరాబాదులోనే అల్లుడికి వుద్యోగం. తొలిసారి పిల్లని అత్తారింటికి దిగబెట్టి వొచ్చేస్తున్న రోజున: హైదరాబాదు స్టేషన్‌లో ఆ పదేళ్ళ తరవాత మళ్ళీ కనబడ్డారు........ఉద్యోగం పోయింది........ఎవడో పాత పరిచయస్తుడు ఆరోజు ప్రయాణం చేస్తాడని తెలిసి– అతడిదగ్గిర కొంత డబ్బు తీసుకొందామని వొచ్చినట్టుంది ఈయన, స్టేషన్‌కి, అవతలి మనిషి పార్వతి ఎక్కిన రైల్లోనే, అదే కంపార్టుమెంటులో ఆమె ఎదుటి బెర్త్‌లోనే ఉన్నారు. ఈయన వొచ్చి డబ్బు అడగ్గానే అతగాడు, "ఛీ కుక్కా! బ్రోకర్ వెధవా" అంటూ తిట్టిపడేశాడు........ఆ ప్రయాణానికి కొనుక్కున్న టిక్కెట్టు కాన్సిల్ చేయించుకుని, ఆయన్ని తీసుకొని ఒక హోటల్‌కి వెళ్ళింది పార్వతి. రూమ్‌లో ప్రవేశించాక–ఏమిటండీ, ఈ ఘోరపరిస్థితి–అంటూ కావలించుకొని ఏడవబోయింది పార్వతి"........స్నానం చేసివస్తాను, అంతవరకు నన్ను ముట్టుకోవద్దు–అన్నారు: ఘోరంగా జరిగిపోయి,

"కూర్చో" అన్నాడు సుందర్రావు.

నిండా నీళ్ళతో తెచ్చిన చిన్నబాల్చీ, చెంబు, అక్కడ రెండో మెట్టుమీద పెట్టింది. పార్వతి తువ్వాలు మోచేతిమీద వేలాడేసుకొని వుంది. అతని మాట విని ఇటు తిరిగింది. స్టూల్ మీద గ్లాసు కిందని దూరంగా పెట్టి, ఉత్తరీయంతో స్టూల్ తుడుస్తున్నాడు సుందర్రావు.

కాళ్ళు కడుక్కుంటూ చూశాడు. పార్వతి స్టూల్ మీద కూర్చుంది. మోకాలి మీద మోచెయ్యి. అరి చేతులో చుబుకం.

"కళ్ళజోడేమిటి: చత్వారమే?"

చిన్న నవ్వొచ్చింది పార్వతికి. ఆ! చత్వారమే. ఒక ఆఫీసు. కాయితాలు చదవడం. రాయడం వున్నాక చత్వారం రాక తప్పుతుందా? బియ్యంలో రాళ్ళేరితేనే గుడ్లుగూటిలో కొస్తున్నాయి."

మెట్లెక్కి వొచ్చాడు సుందర్రావు. తువ్వాలు అందుకుని ముందు చేతులూ తరవాత కాళ్ళూ తుడుచుకున్నాడు. "ఒకవాటా యిల్లు అద్దెకివ్వలేదా?"

"ఇచ్చేను."

"మేడమీద గదులు రెండూ?"

"అవీనీ."

"వాళ్ళెవరూ కనబడరేం?"

"ఈ వాటాలో వాళ్ళు ఏదోవూరు పెళ్ళికి వెళ్ళారు. మేడమీద హైస్కూలు హెడ్ మిస్ట్రెస్ రాత్రి ఎనిమిదింటికి భోజనం చేసిగాని రాదు."

—"మామూలుగా మాట్లాడేస్తోంది. ఇందాకున్న బింకం లేదు," అనుకున్నాడు సుందర్రావు.

కాని పూర్తిగా క్షమిస్తుందని, మనస్ఫూర్తిగా స్వీకరిస్తుందని నమ్మకం లేదు........పదేళ్ళపాటు కనిపించకుండా హైదరాబాదులో ఉండిపోయినపుడు, తిరిగి కలుసుకోగానే బేల అయిపోయింది. హోటల్ గదిలో రాత్రి తెల్లవార్లూ ఏడుస్తూ కూర్చుంది. తన శరీరంలో ప్రతి భాగాన్ని ఆత్మీయతతో, కాపీర్నంతో స్పృశించింది, తను ఉద్యోగం పోగొట్టుకున్నందుకు బహిరంగంగా సంతోషించింది. తనకి అంటూ ఇలా మిగలడం ఆమె అదృష్టంగా భావించింది. అయితే తిరిగి ఇంటికొచ్చాక—

మళ్ళీ తనకి ఒక ట్రాన్స్‌పోర్టు కంపెనీలో ఉద్యోగం వచ్చేక,

"నాన్నగారూ నేనూ యిద్దరం సంపాదిస్తున్నాం కదా, నువ్వు ఉద్యోగం మానేయమ్మా!" అని కొడుకు అన్నాడు, తను ఒప్పుకోలేదు. అంచేత ఆమె కూడా వొప్పుకోలేదు. కాని అప్పుడామె చూసిన చూపు, అది రాముడి అక్షయ తూణీరం నుంచొచ్చిన నారాయణాస్త్రమేకాని మరొకటి కాదు!...." అలా నెల రోజులు గడిచాయి అంతే—

ఆ సాయంకాలం సుందర్రావు తల్లి హఠాత్తుగా చచ్చిపోయిందని తెలియక డ్యూటీ అయిపోయాక ఇంటికి రాకుండా ఎవరో మిత్రుడితో, ఆ నెల్లాళ్ళకీ మొదటి సారిగా ఒక బార్‌లో కాలక్షేపం చేస్తూ వుండగా. తన కోపం వెతికి వెతికి అక్కడ పట్టుకొని ఇంటికి తీసుకెళ్ళాడు కొడుకు. పార్వతితో ఏం చెప్పాడో మరి—

మర్నాడు ఉదయం తల్లికి తలకొరివి పెట్టడానికి ఇల్లు వదిలేదాకా— పార్వతి తనవేపు చూడలేదు. తనతో అన్యాపదేశంగానైనా మాట్లాడలేదు....

అలాంటప్పుడు అట్నుంచి అలాగే, అస్తి సంచయనం చేసుకుని కాశీ వెళ్ళి గంగలో వాటిని నిమజ్జనం చేసి—మరి రాకపోడం తప్ప వేరే దారి ఏముంది తనకి? కాశీలో దీక్ష! హృషీకేశ్‌లో నిష్ఠ, గయలో తపస్సు, పూరీలో ధ్యానం, కంచిలో సన్న్యాసం, స్వామి దరహాసానంద శిష్యత్వం....

పాలు పుచ్చుకోడానికి ముందు ఒక మంత్రం చదివాడు సుందర్రావు. కొంచెం చల్లారి ఉన్నాయేమో, గటగటా తాగేశాడు.

"నేను ధ్యానం చేసుకోవాలి. రెండు మూడు గంటలు పడుతుంది. ఆ మూల వీలవుతుందా?" అన్నాడు.

పార్వతికేమీ తోచలేదు, ఆ క్షణంలో. ఈయన ఓ సారి చూసిపోదామని వచ్చారా, లేక మళ్ళీ కొన్నాళ్ళు (శాశ్వతంగా ఒకచోట ఒక వృత్తిలో, ఒక ప్రవృత్తిలో ఉండడం ఆయనకి ఎలాగూ అసాధ్యమే కనక) యిక్కడ వుందామని వచ్చారా? ఈయన రావడం విషయంలో. కొన్నాళ్ళు యిక్కడ ఉండడం విషయంలో, కొడుకూ, కోడలూ ఏ అభిప్రాయంలోకి వస్తారో? ఇంట్లో అద్దెలకున్న వాళ్ళు, ఇరుగు పొరుగు—అంతా ఈయన్ని గురించి ఏమనుకుంటారు, ఏం అడుగుతారు, వాళ్ళకి ఏమిటి చెప్పి మరిన్ని

బాధిస్తున్నాయి.

"నేను ఆ మూల ధ్యానం చేసుకోవచ్చా?"

పార్వతి మాట్లాడలేదు. లోపలికెళ్ళి ఎప్పుడో పూర్వులు జాగ్రత్తచేసిన లేడిచర్మం- గోడ నున్నందువల్ల పట్టిన దుమ్ముదులిపి- తెచ్చి అక్కడ "ఆ మూలని" పరిచింది. "ఇంకేమైనా కావాలా?"

సుందర్రావు తల అడ్డంగా ఆడించాడు. వెంటనే లేచి, తొడుక్కున్న కమీజూ చుట్ట బెట్టుకున్న గూడకట్టు పంచే విప్పేశాడు. సన్న్యాసులు కట్టుకునే కచ్చడం మాత్రం ఉంచుకున్నాడు. "ఈ దీపం వొద్దు. ఏ దీపమూ వొద్దు" అన్నాడు. జింకచర్మం మీద నిలబడి, ముందు పశ్చిమంగా తిరిగి నమస్కారం చేసి, మంత్రం చదివి, అదయిపోయాక పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు.

0 0 0

రాత్రి పదిగంటలయింది,

రమణ, విజయ-రిక్షదిగి లోపలికొచ్చారు.

వరండాలో ఆ మూలని ఒక ఆజానుబాహువైన పురుషుడు దేవమానవ దూష్యమైన వస్త్రంలో, శీర్షాసనంలో ఉండడాన్ని ముందుగా చూసింది విజయ. నోటికి మాట ఏదీరాలేదు. ఒకవేలితో చూపించి రమణకి దగ్గరగా జరిగింది.

"ఏయ్! ఎవరక్కడ?" అని గట్టిగా అడిగాడు రమణ. సమాధానం లేక పోడం చూసి. కాలింగ్ బెల్ మీట నొక్కాడు—పార్వతి తలుపు తెరిచింది. హడావుడిగా లోపలికెళ్ళి వరండా మీద వెలిగే దీపం మీట నొక్కబోతే పార్వతి అతన్ని ఆపేసింది. "మీ నాన్నగారు" అంది, అతి తక్కువ స్వరంతో, కొడుకు కళ్ళలోకి నిర్లిప్తంగా చూస్తూనూ.

"ఇదో కొత్త అవతారం కాబోలు. మళ్ళీ ఏ మొహం—"

పార్వతి కొడుకు నోరు తన చేత్తో మూసేసింది.

"నువ్వు కూడా మొగాడివే నాయనా. నీకూ ఆ హక్కులన్నీ వున్నాయి. తాగినా, తిరిగినా, ఆనందం అయిపోయాక ఇంటికి చేరుకోవచ్చు. అలాక్కాకుండా వైరాగ్యం పుట్టిందీ, సన్న్యాసుల్లో కలిసి పోయీ కూడా! అక్కడా విసుగనిపిస్తే అప్పుడు కూడా మళ్ళీ ఇంటికి చేరుకోవచ్చు. ఒకసారి ఇల్లు విడిచి మంచికో చెడ్డకో వెళ్ళిపోయిన ఆడదైతే మాత్రం మళ్ళీ ఆ గడప తొక్కడానికి వీలుండదు. మొగాడికి తన యింటికి తను చేరుకోడానికి ఎప్పుడూ హక్కుంటుంది. ఈ హక్కు తీసెయ్యడానికి ఎవరికీ హక్కులేదు" అంది పార్వతి శాంతంగా, కొడుకునీ, కోడల్నీ మార్చి మార్చి చూస్తూ.

విజయ తలవంచుకుంది.

రమణ తీవ్రంగా ఏదో అనబోయిన వాడిలాగ పెదవులు విప్పి ఒకసారి గాలి పోసుకున్నాడు.

పార్వతి, కొడుకు చేతులు రెండూ తన చేతుల్లోకి తీసుకుని, "ఆయన ఒకప్పుడు నాకు, అందరికంటేనూ ఎక్కువ వారు. ఇప్పుడు నాకేమీకారు. కాని, ఆయన, ఎప్పుడూ మీ నాన్నగారే (నా నాయనా!" అంది పూడుకుపోయిన గొంతుతో.

రమణకి బోధ పడిందల్లా ఒక్కటి. ఈ ఇల్లు ఇంకా ఆయన పేరును మోస్తున్నది.

***